అలంపూరు ఆలయాల్లో భక్తుల రద్దీ

అలంపూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం సోమవారం కావడంతో జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లోని జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొన్నది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తుంగభద్ర నదీ తీరాన కార్తీక స్నానాలు ఆచరించి, ఉభయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి ఆలయంలో అభిషేకాలకు బారులుతీరారు. జోగుళాంబ ఆలయంలో కుంకుమార్చన, త్రిశతి ఖడ్గమాల పూజలు చేయించుకొని ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించారు. సాయంత్రం చిన్నారులు నవబ్రహ్మ సాంస్కృతిక కార్యక్రమం, కూచి పూడి నృత్యాలు చేశారు. అనంతరం తుంగభద్ర నదీ తీరాన అర్చకులు దశవిధ నదీ హారతి నిర్వ హించారు. సంబంధిత దేవస్థానాల్లో భక్తులకు ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటు చేసి దర్శనానికి అనుమతినిచ్చారు.



అలంపూర్‌లో తుంగభద్ర నదీ తీరాన నదీహారతిని ఇస్తున్న అర్చకులు

తెగుళ్ల బారిన మిరప

- పెరిగిన పెట్టుబడితో రైతన్న విలవిల
- పంట మార్పిడి లేకనే వైరస్



వీరాపురంలో తెగులు సోకిన మిరప పంటను తొలగించిన రైతులు

4

అనుబంధ గ్రామాలు.. అభివృద్ధికి దూరం

- పంచాయతీ శివారు గ్రామాల్లో తిష్టవేసిన సమస్యలు
- జిల్లాలో 25 పల్లెలకు పైగా కనీస వసతులు కరువు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



బీటీకి నోచుకోని పెద్ద తాండ్రపాడుకు వెళ్లే రోడ్డు

4

రాజకీయ ప్రాధాన్యం లేక నష్టపోతున్న బీసీలు

- స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి
- తక్కువ జనాభా ఉన్న కులాలకు రోస్టర్ అమలు చేయాలి
- కులగణనను పూర్తి చేసి వివరాలు వెల్లడించాలి
- బీసీ డెడికేటెడ్ కమిషన్ అభిప్రాయ సేకరణలో నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ వెనుకబడిన తరగతుల డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు, చిత్రంలో కలెక్టర్ విజయేందిర బోయి

'బీసీ కులగణన చేపట్టాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి. ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి. బీసీల్లోని అన్ని కులాల వారికి అవకాశాలు ఇస్తేనే వారి అభివృద్ధి సాధ్యమౌతుంది. కులగణన చేపట్టాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయం' అని అన్నారు బీసీ కుల సంఘాల నాయకులు. మహబూబ్‌నగర్ పట్టణంలోని కలెక్టరేట్‌లో సోమవారం తెలంగాణ వెనుకబడిన తరగతుల డెడికేషన్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లపై బహిరంగ విచారణ నిర్వహించారు. పలువురు నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

5

- మహబూబ్‌నగర్, ఆంధ్రజ్యోతి

జిన్నింగ్‌లో.. కన్నింగ్

- కాటన్ సీడ్ రైతులను ముంచేస్తున్న జిన్నింగ్ మిల్లర్లు, ఆర్గనైజర్లు
- తరుగు, ఫీజు, బీమా భారం రైతుల నెత్తిపైనే మోపుతున్న పరిస్థితి
- సీసీఐ నిర్ణయించిన ధర కంటే ఎక్కువగా ప్రాసెసింగ్ ఫీజు
- పంట అప్పగించిన తర్వాత కూడా ప్రమాద బీమా సొమ్ము రైతుదే..
- పత్తి దూదికి తక్కువ రేటు, రైతుకు చెప్పిందే తూకం, ఇచ్చిందే ధర





కాటన్ సీడ్ కోసం సాగు చేసిన పత్తి

మహబూబ్‌నగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : కాటన్ సీడ్ రైతులను జిన్నింగ్ మిల్లర్లు, సీడ్ ఆర్గనైజర్లు నిండా ముంచేస్తున్నారు. ఫౌండేషన్ సీడ్ ఇచ్చిన దగ్గరి నుంచి పంట చేతికి వచ్చి డబ్బులు చెల్లించే వరకు వారి దోపిడీ పర్వం కొనసాగుతూనే ఉంది. అడ్డగోలు వడ్డీ రేట్లకు అప్పులివ్వడం, సీడ్ ఫెయిల్ కాకున్నా అయ్యిందని చెప్పడం, ఇచ్చిన అప్పునకు బదులు భూములను రిజిస్ట్రేషన్ చేసుకోవడం, ఎవరైనా అడిగితే తామే రైతులను బాగు చేస్తున్నామని చెప్పుకోవడం సీడ్ ఆర్గనైజర్ల తీరుగా మారింది. ఎప్పటికప్పుడు కొత్తగా రైతును ఎలా దోపిడీ చేయాలనే ఎత్తులు వేసే ఆర్గనైజర్లు ఇప్పుడు జిన్నింగ్‌లో కన్నింగ్ ఎత్తులు వేస్తున్నారు. కాటన్ సీడ్ ఇచ్చిన రైతుల నుంచి అడ్డగోలుగా తరుగు పేరిట దోచేస్తున్నారు. సాధారణంగా కాటన్ సీడ్‌లో తరుగు అసలు తీయవద్దు. ఒకవేళ ఎంతోకొంత పత్తి క్వాలిటీ కోసం తీయాలి. కానీ, జిన్నింగ్ మిల్లర్లు రైతు క్వింటాల్ పత్తి తీసుకెళ్తే ఏకంగా ఏడు కిలోల నుంచి 10 కిలోల వరకు తరుగు తీసివేస్తున్న సందర్భాలు ఉన్నాయి. తరుగు, ప్రాసెసింగ్ ఫీజు, మిల్లు బీమాను కూడా రైతుల నెత్తిపైనే మోపుతున్నారు. ఒకవేళ సదరు రైతు గుర్తించి విక్రయించబోనని చెబితే తాము ఇచ్చిన అప్పులు తిరిగి చెల్లించాలని మెలిక పెడుతూ ఒక చట్రంలో

(మిగతా 5లో..)

బీమా సొమ్ము రైతు నుంచే..

సాధారణంగా ఏ మిల్లర్ అయినా తన మిల్లుకు బీమా చేయిస్తారు. అందులో ఉన్న నిల్వలకు ఏదైనా ప్రమాదం వల్ల నష్టం జరిగితే దాన్ని బీమా చెల్లించిన కంపెనీ నుంచి తిరిగి రాబట్టుకుంటారు. ఒకసారి రైతు పంట విక్రయించిన తర్వాత రైతుకు ఆ పంటపై ఎలాంటి బాధ్యత ఉండదు. కానీ, జిన్నింగ్ మిల్లు నిర్వాహకులు బీమా పేరుతో రైతుల నుంచే వసూళ్లకు పాల్పడుతున్నారు. ప్రతీ క్వింటాల్‌కు ఇంత మొత్తం అని రైతుల నుంచి పంట విక్రయం సమయంలోనే ఫీజు వసూలు చేస్తున్నారు. ఇది పూర్తిగా రైతులను దోపిడీ చేయడమనే ఆరోపణలు వస్తున్నాయి. పంట విక్రయించిన తర్వాత భద్రపర్చుకొని నష్టం వస్తే సదరు మిల్లరే దాన్ని భరించాల్సి ఉండగా రైతుల నెత్తిపైనే మోపుతున్నారు. ఇదిలా ఉంటే ఫౌండేషన్ సీడ్ 400 గ్రాములు ఇస్తే దానికి రూ. 1500 వరకు తీసుకుంటారు. అదే సమయంలో సీడ్‌ను జీఓటీ (గ్రో ఔట్ టెస్టు)కి పంపించే సమయంలో రైతుల నుంచి మూడు ప్యాకెట్లు తీసుకుంటారు. ఒక్కో ప్యాకెట్‌లో కిలో విత్తనాలు ఉంటాయి. ఒక ప్యాకెట్ రైతుకు, ఒక ప్యాకెట్ ఆర్గనైజర్‌కు, ఒక ప్యాకెట్ కంపెనీ తీసుకుంటుంది. ఒకవేళ జీఓటీలో విత్తనాలు ఫెయిల్ అయితే తీసుకున్న శాంపిల్ ప్యాకెట్లలో రెండింటిని మొత్తం విత్తనాలు తిరిగి ఇవ్వాలి. పాస్ అయితే శాంపిళ్లతో సహా మొత్తం విత్తనాలకు ధర చెల్లించాలి. కానీ, ఆ శాంపిల్ ప్యాకెట్లు మాత్రం తిరిగి ఇవ్వడం లేదు. ఒక్కో రైతు దగ్గర 2 కిలోలు అంటే ఒక్కో ఆర్గనైజర్ దగ్గర వందల మంది రైతులు ఉంటారు. ఈ రకంగానూ రైతులు దోపిడీకి గురవుతున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి ఈ దోపిడీని అరికట్టాల్సిన అవసరం ఉంది.

చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి

పెద్దమందడి/వీపనగండ్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలంలోని పుల్గర్‌చర్ల, గోపల్‌దిన్నె గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తుందని, ప్రైవేటు వ్యక్తులకు విక్రయించి నష్టపోవద్దని అన్నదాతలను కోరారు. పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థుల భోజనానికి సన్న బియ్యం సరఫరా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సింగిల్ విండో మాజీ చైర్మన్ బాల్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, నాయకులు కృష్ణయ్య, గంగిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, కుర్మయ్య, సింగయ్యశెట్టి రైతులు పాల్గొన్నారు.

పాలమూరు ప్రజల నోట్లో మట్టి కొట్టినట్లే

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



మాట్లాడుతున్న నిరంజన్‌రెడ్డి

వనపర్తి అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరు ప్రజల నోట్లో మట్టికొడుతున్నాడని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాలమూరు బిడ్డను అని చెప్పుకుంటూ కొడంగల్ ఫార్మాసిటీకి భీమా ప్రాజెక్టు నుంచి ఏడు టీఎంసీల నీళ్లు తరలించడానికి ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసిందని, ఇది ముమ్మాటికి పాలమూరు ప్రజల నోట్లో మట్టి కొట్టినట్లే అని మండిపడ్డారు. ఈ నీళ్లను తరలించడం వలన దేవరకద్ర, మక్తల్, వనపర్తి, కొల్లాపూర్ ప్రాంతాలకు గొడ్డలి పెట్టన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ముచ్చర్ల దగ్గర ఫార్మాసిటీ కోసం 14వేల ఎకరాలు సేకరించిందని, ఈ ఫార్మాసిటీకి గోదావరి నీళ్లను తరలించాలని ప్రతిపాదించినట్లు గుర్తు చేశారు. ఇది పక్కన పెట్టి కొడంగల్‌లో వద్దన్న చోట ఫార్మాసిటీ పెడతామంటున్నారని, ఇది కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయమని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఏడాది కాలంగా ఒక టీఎంసీ నీళ్లు ఇచ్చే పనులు చేపట్టలేదని, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేసి ఉంటే ఈ ఏడాది 60 శాతం నీళ్లు ఇచ్చే అవకాశం ఉండేదని అన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో ప్రకటించిన ఏ ఒక్క అంశం కాంగ్రెస్ పార్టీ అమలు చేయలేదని, రేపు వరంగల్‌కు ముఖ్యమంత్రి ఏ మొహం పెట్టుకొని పోతున్నాడని విమర్శించారు. వరంగల్ నుంచి రైతుల తిరుగుబాటు ప్రారంభమవుతుందని తెలిపారు.

అవినీతి జాదు

- బిల్ కలెక్టర్ల వేతనాలు స్వాహా
- మునిసిపాలిటీలో రోజుకొకటి బయటికి వస్తున్న అవినీతి ఆరోపణలు



నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ కార్యాలయం

నాగర్‌కర్నూల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కందనూలు మునిసిపాలిటీలో అవినీతి కంపుకొడుతోంది. నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీలో రోజుకు ఒకటి బయటికి వస్తున్న అవినీతి అక్రమాలు విస్తు గొలుపుతున్నాయి. లేని అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని సృష్టించి వారి పేరిట దాదాపు కోటి రూపాయలు సొంత ఖాతాలోకి మళ్లించుకున్న స్కాంలో క్రిమినల్ కేసు నమోదై ఒకరు సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. వాహనాల మరమ్మతు, డీజిల్, పెట్రోలు వినియోగం వంటి విషయాలలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

బిల్ కలెక్టర్ల వేతనాలు మాయం

నిధుల దుర్వినియోగం విషయంలో అనేక ఆరోపణలు ఉండగా తాజాగా 13 మంది బిల్ కలెక్టర్ల వేతనాలు దారి మళ్లించడంపై దుమారం రేగుతోంది. మునిసిపాలిటీలో అవసరానికి మించి సిబ్బంది ఉన్నారనే కోణంలో గత ఆగస్టు, సెప్టెంబరు మాసంలో 13 మంది బిల్ కలెక్టర్లను పక్కకు పెట్టారు. రెండు నెలల పాటు వారిని విధులకు హాజరు కానివ్వలేదు. కార్మిక సంఘాల ఆందోళనలు, రాజకీయ ఒత్తిళ్ల నేపథ్యం కారణంగా తిరిగి వారిని అక్టోబరు మాసంలో విధుల్లోకి తీసుకున్నారు. ఇక్కడ అసలు విషయం ఏమిటంటే బిల్ కలెక్టర్లను రెండు నెలల పాటు పక్కకు పెట్టిన వేతనం కూడా చెల్లిస్తామని చెప్పి కేవలం ఆగస్టు నెల జీతం ఇచ్చారు. రెండు నెలలకు సంబంధించిన బిల్లులు కూడా మునిసిపాలిటీ ఖాతాలో నమోదయ్యాయి. నెల వేతనంతో సరిపెట్టుకుని సంతోషపడిన సిబ్బందికి ఆగస్టు నెలలో ప్రావిడెన్స్ ఫండ్‌లో ఖాతాలో జమ కావడంతో అసలు విషయం బయట పడింది. బిల్ కలెక్టర్ల కు నెల వేతనం మాత్రమే ఇచ్చి మిగితా డబ్బులను మునిసిపల్ శాఖలో కీలక బాధ్యతలు చూసే వారు నొక్కేసినట్లు బహిరంగంగానే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పారిశుధ్య కార్మికులు, టెక్నికల్ సిబ్బందికి పెరిగిన వేతనాలపై అనేక ఆరోపణలు ఉన్నాయి.

హామీ నెరవేర్చకపోతే నిరవధిక సమ్మె



జీవో ప్రకారం మునిసిపాలిటీ సిబ్బందికి ఒక్కొరికి రూ.36 వేల చొప్పున ఏరియర్స్ పెండింగ్‌లో ఉన్నాయి. తొలగించిన 13 మంది బిల్ కలెక్టర్లకు రెండు నెలల వేతనాలు చెల్లించకుండానే అధికారులు ఆగస్టు నెల బిల్లులు చేసుకున్నట్లు అనుమానం. ఇటీవలే మునిసిపాలిటీలో కోటి రూపాయల అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని సస్పెండ్ చేసి వదిలేయడం సరికాదు. నిధులను రికవరీ చేసి కేసు నమోదు చేయాలి.

- ఆర్.శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, నాగర్‌కర్నూల్

సింగిల్ విండోలో కొనసాగుతున్న విచారణ

తిమ్మాజిపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట సింగిల్ విండో కార్యాలయంలో జరిగిన అవినీతి ఆరోపణలపై సోమవారం డీసీవో అసిస్టెంట్ రిజిస్టర్ అంజమ్మ విచారణ కొనసాగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు సింగిల్ విండో కార్యాలయంలో తీసుకున్న దీర్ఘకాలిక, వ్యవసాయ రుణాలు 2021-2022లో కార్యాలయంలో చెల్లించి రసీదు కూడా తీసుకున్నారు. రైతుల ఖాతాల్లో ఆ డబ్బు జమ చేయనందుకు విచారణ జరుపుతున్నామన్నారు. రికార్డులను పరిశీలిస్తున్నామని, సిబ్బంది ద్వారా వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు. సీఈవోగా విధులు నిర్వహించి సస్పెండ్ అయిన నరేష్‌ను విచారణ కోసం కార్యాలయానికి రావాలని ఆదేశించామన్నారు. 2024 అక్టోబరు 18,19,22 తేదీల్లో రైతుల ఖాతాల్లో రూ. 3.97 లక్షలు ఎవరు జమ చేశారో తెలియాల్సి ఉందని ఆమె తెలిపారు.

ప్రజాధనం.. దుర్వినియోగం

- సొమ్మును కాజేసేందుకు అడ్డదారులు తొక్కుతున్న కొందరు అధికారులు
- కోట్లు కొల్లగొట్టినా చర్యలు శూన్యం



అయిజటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు నిరుపేదల కోసం సంక్షేమ పథకాలు అమలు చేయడం సర్వసాధారణం. ఈ పథకాలకు కోట్లల్లో నిధులు విడుదల చేస్తుంటాయి. చిన్నపాటి లొసుగులను ఆసరా చేసుకుని కొందరు అధికారులు, నాయకులు లక్షలు, కోట్ల రూపాయలను దుర్వినియోగం చేస్తున్న సంఘటనలు ఉన్నాయి. ఆయా పథకాలలో కోట్ల నిధులు కొల్లగొట్టడంలో ఆయా శాఖల్లో ఉన్న కొందరు ఉద్యోగులే సూత్రధారులుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నారు.

జిల్లాలో జరిగిన కొన్ని సంఘటనలు

2019-20 నుంచి 2022-23 సంవత్సరాలకు గాను గద్వాల జిల్లాలో 11 మిల్లులు సీఎంఆర్ వంద శాతం ప్రభుత్వానికి అందించలేదని సివిల్ సప్లై అధికారులే ఈ విషయాన్ని ప్రకటించారు. మూడేళ్లుగా ఈ మిల్లులు 7,520 మెట్రిక్ టన్నుల ధాన్యం బకాయిపడ్డట్లు తెలిపారు. ఈ విధంగా అప్పట్లో ప్రభుత్వం కొన్న ధర ప్రకారం రూ.15.30 కోట్లమేర విలువచేసే ధాన్యాన్ని కొందరు రైస్‌మిల్లర్లు దుర్వినియోగం చేసినట్లు అర్థమవుతోంది.

గట్టు మండలంలో రైతుబంధు పథకం నిధులు రూ. 36 లక్షలు కాజేసిన వ్యవహారంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో ఒక ఉద్యోగి సస్పెండ్ అయ్యారు. అదేవిధంగా గొర్రెల పంపిణీ పథకంలో రూ. 2.01 కోట్ల అక్రమాలు జరిగిన వ్యవహారంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు పశువైద్యశాల సహాయ సంచాలకుడిని అరెస్ట్ చేశారు. గద్వాల విద్యుత్ కార్యాలయంలో డీడీల కుంభకోణానికి సంబంధించిన వ్యవహారంలో 2023 సంవత్సరంలో జరిగిన విచారణలో రూ. 21.11 లక్షలు దుర్వినియోగమైనట్లు బయటపడింది. అలంపూర్ నియోజకవర్గానికి చెందిన ఒకవ్యక్తి ప్రభుత్వ భూమిని లీజుకు తీసుకుని దాదాపు రూ. 4 కోట్ల మేర అద్దె ప్రభుత్వానికి చెల్లించడం లేదని ఇటీవల కాంగ్రెస్ నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రజలకు అందాల్సిన పథకాల సొమ్మును కొందరు అధికారుల సహకారంతోనే అవినీతిపరులు జేబులు నింపుకుంటున్నారు. కోట్ల రూపాయలు కొల్లగొట్టిన ఆర్థిక నేరగాళ్లు సమాజంలో దర్జాగా తిరుగుతున్నారు. సామాన్యుడు చిన్న తప్పు చేస్తే నానా యాగి చేసే అధికారులు ఈ సంఘటనలపై కూడా కఠినంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు.

సీఎంఆర్ ఇవ్వని మిల్లులను డీఫాల్టులో ఉంచాం

ప్రభుత్వ నిబంధనల మేరకు ఇప్పటి వరకు సీఎంఆర్ ఇవ్వని 11 మిల్లులను డీఫాల్టులో ఉంచాం. నిబంధనల మేరకు ఆయా మిల్లులపై చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

- విమల, డీఎం, గద్వాల



వనపర్తి పట్టణంలోని ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థి వివరాలను పరిశీలిస్తున్న సిబ్బంది

ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-3 పరీక్షలు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా/గద్వాలటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా నిర్వహించిన గ్రూప్-3 పరీక్ష వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. గ్రూప్-3 పరీక్షలో భాగంగా సోమవారం నిర్వహించిన పేపర్-3 పరీక్షకు వనపర్తి జిల్లాలో మొత్తం 8,312 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 4,565 మంది మాత్రమే హాజరయ్యారని పరీక్షల రీజనల్ కోఆర్డినేటర్ రామ్‌నరేష్ యాదవ్ తెలిపారు. మరో 3,747 మంది అభ్యర్థులు గైర్హాజరు అయినట్లు ఆయన పేర్కొన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో మొత్తం 8,570 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 4,756 మంది మాత్రమే హాజరయ్యారని, 3,814 మంది గైర్హాజరయ్యారు.



గద్వాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

చిల్లర కష్టాలు

● మార్కెట్‌లో రూ.10 నోట్ల కొరత

● చెల్లుబాటు చేయనివారిపై కేసు పెట్టాలంటున్న ఆర్‌బీఐ అధికారులు

● మార్కెట్, చిరువ్యాపారుల దగ్గరే సమస్య అధికం

● రూ.50లోపు కొనటానికి అవస్థలు

గృహిణి సుజాత కార్తీకమాసం సందర్భంగా దేవుడి దగ్గర కొన్ని చామంతి పూలు పెట్టి పూజ చేస్తోంది. ప్రతిరోజు రూ.10ల పూలు కొనటానికి పోతే చిల్లర లేదు.. ఫోన్ పే చేయమని అడుగుతున్నారు.. చేసేదిలేక ఇష్టం లేకపోయినా.. రూ.50 నోటుకు సరపడా కొనాల్సి వస్తోందని వాపోయింది. రైతుబజార్‌లో కొత్తిమీర, పుదీన, మెంతికూర, పుంటికూర ఏవైనా రూ.10 ఆకుకూరలు కొందామంటే ఇదే సమస్య. రూ.50 లోపు కొనుగోలు చేయటానికి పట్టణం, పల్లెల్లో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

పాలమూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రైతుబజార్, మార్కెట్, పండ్లు, పూలు ఇతర వస్తువులు కొనటానికి చిల్లర సమస్యగా మారింది. మార్కెట్‌లో రూ.10 నోట్ల కొరత అధికమైంది. ఈ మధ్య కాలంలో మార్కెట్‌లో పది రూపాయల నోట్లు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. రూ.2 వేల నోట్ల రద్దు అనంతరం బ్యాంకుల్లో రూ.500, రూ.200, రూ.100, రూ.50 నోట్ల చెలామణీ పెరిగిపోయింది. అదేస్థాయిలో చిన్ననోట్ల చెలామణీ క్రమేణా తగ్గుతోంది. జిల్లా కేంద్రంలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు, స్థానికులు, వ్యాపారులు చిల్లర దొరకక ఇబ్బందులు పడుతున్నారు. రూ.10ల నోట్లు కావాలని అడిగితే లైనులో నిలబెట్టి అడ్రసు రాసుకుని రూ.10 నోట్ల (అధికారులు చెప్పిన సమయంలో వెళితేనే ఒకవేయి) బెండ ఇస్తున్నారు. వ్యాపారులతో పాటు, బజారులో అనేక వస్తువులు కొనటానికి వెళ్లినప్పుడు, రైతుబజార్, ఇతర మార్కెట్‌కు వచ్చే వినియోగదారులు చిల్లర సమస్య మాటల్లో చెప్పలేం. రూ.50లోపు కొనుగోలు చేయటానికి అవస్థలు పడాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు.

జిల్లా కేంద్రంతో పాటు, జడ్చర్ల, భూత్పూర్ ఇతర ప్రాంతాల్లో ఉన్న ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకు తదితర జాతీయ బ్యాంకులు, ప్రైవేట్ బ్యాంకుల్లో రూ.10నోట్లు అందుబాటులో ఉంచటం లేదు. ఇదేమని అడిగితే రిజర్వుబ్యాంకు, హెడ్ ఆఫీస్ నుంచి పంపితేనే ఇవ్వగలం అంటున్నారు. ఈ మధ్య గ్రామాల్లో రూ.10, రూ.20, రూ.50, రూ.100ల నోట్లు చెల్లవనే అసత్య ప్రచారంతో వినియోగదారులు గందరగోళానికి గురవుతున్నారు. బ్యాంకు అధికారులు రూ.పది నోట్లను ప్రజలకు అందుబాటులో ఉంచాలని వ్యాపారులు, ప్రజలు రిజర్వు బ్యాంకు అధికారులను కోరుతున్నారు. నాణేలను చెల్లుబాటు చేయాలనే ఉద్దేశంతోనే ఆర్‌బీఐ నుంచి నోట్ల ముద్రణ ఆపేసినట్లు కొందరు అధికారులు చెబుతున్నారు. అందుకనే రూ.10 కాయిన్స్ విరివిగా అనేక ప్రాంతాల్లోకి బ్యాంకు సిబ్బందితో వెళ్లి అవగాహన కల్పిస్తామని చెబుతున్నారు.

● గతంలో రిజర్వు బ్యాంకు నుంచి విడుదల చేసిన రూ.10నాణేలు చెల్లవనే పుకార్లు వ్యాపించింది. దాంతో మార్కెట్‌లోకి ఆ నాణేలను తీసుకోకపోవడం వల్ల వాటి చలామణి నిలిచిపోయింది. ఈ మధ్య బ్యాంకులో అధికారులు పెద్ద మొత్తంలో డ్రా చేసే వారికి కచ్చితంగా రూ.10 నాణేలను(వేలల్లో)అంటగడుతున్నారు. నాణేలను తప్పకుండా అందరు తీసుకోవాలనటంతో తీసుకువెళ్లి ఎవరూ తీసుకోకపోతే మళ్లీ బ్యాంకులోనే డిపాజిట్ చేసుకుంటున్నారు. మహబూబ్‌నగర్, జడ్చర్ల బస్టాండ్ హోటళ్లలో తప్పనిసరిగా ప్రజలకు రూ.పది నాణేలను మీరు తీసుకోండి, నేను తీసుకుంటానని చెప్పటంతో తీసుకుంటున్నారు.



ఆర్‌బీఐ నుంచి విడుదల చేసిన రూ.10 నోటు



ఆర్‌బీఐ విడుదల చేసిన రూ.10 కాయిన్స్

రూ.10నోట్లు దొరకక ఇబ్బంది పడుతున్నాం



మార్కెట్‌లో రూ.10నోట్లు దొరకటం లేదు. కిరాణ సామగ్రికి వచ్చే వినియోగదారులు రూ.10నోట్లు తీసుకురావడం లేదు. కాయిన్స్ ఇస్తే తీసుకోవాలి. మాకు ఇవ్వాలి... అలా అయితేనే లావాదేవీలు కొనసాగుతాయి. కొంతకాలంగా రూ.10నోట్లు దొరకక రోజువారి వ్యాపార లావాదేవీలకు కష్టమవుతోంది. పెట్రోల్ బంకుల్లో రూ.10నోట్లు చిల్లర తెచ్చుకుని వ్యాపారం నిర్వహిస్తున్నాం. బ్యాంకుల్లో రూ.10నోట్లను అందుబాటులో ఉంచాలి.

- వలిగొండ సంతోష్‌కుమార్, కిరాణం వ్యాపారి, మహబూబ్‌నగర్

రూ.10 కాయిన్స్ ఒప్పుకోకుంటే కేసు పెట్టవచ్చు

రూ.10, రూ.20 నోట్లు, కాయిన్స్ చెల్లుబాటుకు ఒప్పుకోనివారిపై కేసుపెట్టవచ్చు. ఆర్‌బీఐ నుంచి ప్రత్యేక అవగాహన కార్యక్రమం కొనసాగిస్తున్నాం. రైతుబజార్, చెన్నై షాపింగ్‌మాల్, సీఎంఆర్, ఇతర సూపర్ మార్కెట్స్‌లోకి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలు రూ.10, రూ.20 నోట్లు, కాయిన్స్‌ను తప్పక లావాదేవీలు చేయవలసిందే.

- నళిని, చీఫ్ మేనేజర్, ఎస్‌బీఐ మహబూబ్‌నగర్



కార్తీక దీపాలు వెలిగించిన భక్తులు

ఉమామహేశ్వరంలో కార్తీక శోభ

అచ్చంపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మూడో సోమవారం కావడంతో భక్తులు వేకువజామునుంచే ఉమామహేశ్వరుడ్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు పెద్దఎత్తున కార్తీక దీపాలను వెలిగించి నీలకంఠుడిని ధ్యానించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ మండపంలో ప్రత్యేక వ్రతాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పార్వతీపరమేశ్వరుల పల్లకి సేవను పాపనాశిని నుంచి ఆలయం వరకు ఉన్న మాడవీధులలో బాజా భజంత్రీలతో ఊరేగింపు నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటి చైర్మన్ బీరం మాధవరెడ్డి, ఈవో శ్రీనివాసరావుతో పాటు ఆలయ సిబ్బంది ధర్మకర్తలి మండలి సభ్యులు పవన్, వినోద్‌లు ప్రత్యేక ఏర్పాట్లను పర్యవేక్షించారు. అర్చకులు వీరయ్య, రవికుమార్, సిబ్బంది లక్ష్మణ్, కవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవధూత స్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం



యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

నారాయణపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట సుభాష్ రోడ్‌లో గల సద్గురు అవధూత నర్సింహ స్వామి 133వ ఆరాధనోత్సవాలు సోమవారం మఠం కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. నర్సింహస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా ధ్వజారోహణం, స్వామివారికి కాగడ హారతి, రుద్రాభిషేకం, గణపతి నవగ్రహ పూజ, యజ్ఞాలు, మహామంగళారతీ తదితర ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగనున్నాయి. గుజరాత్‌కు చెందిన భరుచ్ మాతా, విజయవాడకు చెందిన బాల అవధూత ప్రకాశనంద సరస్వతి స్వామిల వారి ఊరేగింపు నిర్వహించారు. మఠం కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



కుంబేశ్వర స్వామి ఆలయంలో ధ్వజస్తంభం ప్రతిష్టిస్తున్న దృశ్యం

కుంబేశ్వరాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ

● కనుల పండువలా కలశాల స్థాపన

● ఆలయ ఆవరణలో వైభవంగా కోటి దీపోత్సవం

రాజోలి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన రాజోలిలో వెలసిన కుంబేశ్వర స్వామి పురాతన ఆలయం నందు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, ఆలయ గోపురంపై కలశాల స్థాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం ఆలయం నందు హోమాలు నిర్వహించి, ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు. అనంతరం కుంబేశ్వర స్వామి ఆలయ గోపురం, ఆంజనేయ స్వామి ఆలయ గోపురంపైన కలశాలను స్థాపించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటి ఆడపడుచులకు ఒడిబియ్యం పోసి స్వామివారి ధ్వజస్తంభానికి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం విచ్చేసిన భక్తులకు మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో కోటి దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు, రాఘవేంద్ర, దాతలు, పాల్గొన్నారు.



కుంబేశ్వర స్వామి ఆలయంపై కలశం స్థాపన చేస్తున్న నిర్వాహకులు

అనుబంధ గ్రామాలు... అభివృద్ధికి దూరం

● పంచాయతీ శివారు గ్రామాల్లో సమస్యలు

● జిల్లాలో 25 పల్లెలకు పైగా కనీస వసతులు కరువు

● ఇబ్బందులు పడుతున్న ప్రజలు



చింతల క్యాంపులో డ్రైనేజీలు లేక ఇళ్ల మధ్య పారుతున్న మురుగు

రాజోలి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బంగారు తెలంగాణ సాధించాలన్నా, ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలన్నా ప్రతి పల్లెలో సమస్యలు తీరాలి. కనీస వసతులు మెరుగుపడాలి. పంచాయతీలకు అనుబంధంగా ఉండే అనుబంధ (మజార) గ్రామాలు అభివృద్ధికి ఆమడదూరంలోనే ఉండిపోయాయి. పంచాయతీలకు నిధులు వచ్చినా.. ప్రజాప్రతినిధులు ఆ గ్రామాలను చిన్నచూపు చూడటంతో సమస్యలు పరిష్కారం కావడంలేదు. అనుబంధ గ్రామాల కోసం ప్రత్యేకంగా నిధులు లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. జిల్లాలో దాదాపు 25 గ్రామాలకుపైగా కనీస వసతులు లేవు. ఫలితంగా ఆ గ్రామాలకు రహదారి ఉండదు. సరైన తాగునీటి సరఫరా దూరమే. విద్యుత్తు సరఫరాలో సమస్యలు, మురుగు కాల్వలు, సీసీ రహదారులు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అనారోగ్యానికి గురై మందులు తెచ్చుకుందామన్నా.. రోడ్డులేక, రవాణ సౌకర్యం లేక నడుస్తూ వెళ్లాల్సిన దీనస్థితి నెలకొంది.

సమస్యలు ఇలా..

అలంపూర్ నియోజకవర్గంలోని అయిజ, వడ్డేపల్లి, ఇటిక్యాల, అలంపూర్, రాజోలి, మానవపాడు, ఉండవల్లి మండలాల్లో మొత్తం 105 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 3.50 లక్షల జనాభా ఉన్నారు. పంచాయతీల పరిధిలో శివారు గ్రామాలు ఉన్నా. ఆయా గ్రామాల సర్పంచులు పంచాయతీల్లో పనులు చేసేందుకే సరైన నిధులు లేవంటూ.. మజార గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయడం లేదు. ఫలితంగా ప్రజలు తాగునీరు, రహదారుల, మురుగు కాల్వలు, సరైన విద్యుత్తు సౌకర్యం లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● రాజోలి మండలంలోని పెద్ద తాండ్రపాడు గ్రామానికి అనుబంధ గ్రామమైన చింతలక్యాంపునకు ప్రధాన రహదారి బీటీ రోడ్డుకు నోచుకోక గుంతలతో అధ్వానంగా ఉంది. ప్రతి పల్లెలో తాగునీరు అందించాలని చేపట్టిన మిషన్ భగీరథ నీరు కూడా సరిగా అందడం లేదు. ఏళ్లుగా తాగునీటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సీసీ రహదారులు లేవు, ఉన్నా మురుగు నీరు పోయేందుకు డ్రైనేజీలు లేవు. తుమ్మిళ్ల గ్రామానికి అనుబంధ గ్రామం అశోక్ నగర్‌కు కంకర తేలిన రోడ్డు ఉండటంతో 5 కి.మీ. దూరం నుంచి అత్యవసర సమయంలో గ్రామం నుంచి మండలానికి వచ్చేందుకు ఇక్కడి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.

మండల కేంద్రమైన రాజోలికి అనుబంధ గ్రామం తుమ్మలపల్లి వాసులు రేషన్ సరుకులకు రావాలన్నా.. ఇబ్బందులు తప్పడం లేదని అంటున్నారు. ప్రభుత్వం అనుబంధ గ్రామాలకు అదనపు నిధులు కేటాయించాలని, ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలి



చింతల క్యాంపు నుంచి పెద్ద తాండ్రపాడు గ్రామ పంచాయతీ కార్యాలయానికి ప్రయాణం చేయాలంటే నరకయాతన తప్పడం లేదు. బీటీ రోడ్డు వేయించాలని అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. కావున మజార గ్రామమైన చింతల క్యాంపును ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని, అభివృద్ధి దిశగా తీర్చిదిద్దాలని కోరుతున్నాం.

పలుమార్లు గ్రామస్తులు, యువకులు కలిసి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాలు సమర్పించాం.

- నాయుడు (చింతల క్యాంపు)

అనుబంధ గ్రామాలను అభివృద్ధి చేయాలి



రైతులు పొలాలకు వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారు. కావున రోడ్లను పరిశీలించి బీటీ రోడ్లు వేయాలి. తాగునీటి సమస్య కూడా ప్రజలను పట్టి పీడిస్తున్నది. తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి అనుబంధ గ్రామమైన చింతల క్యాంపును అభివృద్ధి చేయాలి.

- రంగన్న (చింతల క్యాంపు)

ఒకే కాన్పులో ముగ్గురు శిశువుల జననం



ఒకే కాన్పులో జన్మించిన ముగ్గురు శిశువులు

గద్వాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గద్వాల పట్టణంలోని అనంతా ఆసుపత్రిలో సోమవారం ఓ గర్భిణి ముగ్గురు శిశులకు జన్మనిచ్చింది. పట్టణంలో వడ్డెవీధికి చెందిన జయశ్రీ, నరేష్ దంపతులకు 2020లో వివాహం కాగా మొదటి కాన్పులో వారికి ఆడబిడ్డ పుట్టింది. ఆ తర్వాత మళ్లీ గర్భం దాల్చగా ముగ్గురు శిశువులు ఉన్నట్లు డాక్టర్లు గుర్తించారు. మెరుగైన వైద్యం తీసుకుంటున్న దంపతులు సోమవారం కాన్పు కోసం అనంత ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యారు. డాక్టర్ అశ్విని ఆపరేషన్ చేసి ముగ్గురు బిడ్డలకు పురుడు పోసింది. ఇందులో ఇద్దరు మగ శిశువులు కాగా ఒకరు ఆడ శిశువు జన్మించింది. దీంతో ఆ దంపతులు, వారి కుటుంబం సంతోషం వ్యక్తం చేశారు. ఆపరేషన్ చేసి పురుడు పోసిన డాక్టర్ అశ్విని, డాక్టర్ వినిషారెడ్డిలకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. తల్లితో పాటు పుట్టిన పిల్లలు ఆరోగ్యంగా ఉన్నారని పిల్లలను పరీక్షించిన డాక్టర్ బిందుసాగర్ తెలిపారు. ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలు జన్మించడం మా ఆసుపత్రిలో ఇదే మొదటి సారి అని డాక్టర్ అశ్విని తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు ధరూరు విద్యార్థి

ధరూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో జరిగే రగ్బీ పోటీలకు ధరూర్ జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి చింటు ఎంపికైనట్లు పాఠశాల పీడీ శ్రీనివాసులు తెలిపారు. ఈనెల 10, 11, 12వ తేదీలలో రంగారెడ్డి జిల్లా మేడ్చల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ అండర్-17 రగ్బీ టోర్నమెంటులో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తరఫున పాల్గొని చక్కటి ప్రతిభ కనబరిచనట్లు తెలిపారు. డిసెంబరు నెలలో బీహార్‌లోని పాట్నాలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థి ఎంపిక పట్ల జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థితో ఉపాధ్యాయులు

అకారణంగా దాడి

● పొలంలోకి గొర్రెలు ఎందుకు పోనిస్తున్నావని అడిగినందుకే..

● కర్నూల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి



మృతి చెందిన మల్లన్న

గట్టు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పొలంలోకి గొర్రెలు ఎందుకు తీసుక వస్తున్నావని అడిగినందుకు కర్రతో తలపై దాడి చేసిన సంఘటనలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని ఆరగిద్ద గ్రామంలో చోటు చేసుకున్నది. ఈ సంఘటనపై గట్టు ఎస్‌ఐ కేటి మల్లేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆరగిద్దకు చెందిన మల్లన్న ఈనెల 15న తన పొలంలో పత్తి పంటలో పనిచేస్తుండగా కుంటన్న, హుస్సేన్, తిమ్మప్పలు అటు నుంచి గొర్రెలను పొలంలో తీసుక వస్తున్నారు. దీంతో తన పొలంలోకి ఎందుకు గొర్రెలను తీసుక వస్తున్నావని అడుగగా కోపోద్రికుడైన హుస్సేన్ ఎద్దుల బండిపైన ఉన్న కర్రతో మల్లన్న తలపై బాదడంతో రక్త గాయమైంది. ఈయనతో పాటు కుంటన్న, తిమ్మప్పలు రాయితో కొట్టగా తీవ్ర గాయాలయ్యాయి. అడ్డం వచ్చిన కుమారుడు సంజీవనికి కూడా గాయాలయ్యాయి. మల్లన్న(58)ను గద్వాల ఏరియా అనుపత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం కర్నూల్‌కు తరలించారు. కర్నూల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి మృతుడి బామ్మార్ది ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్య కేసుగా నమోదు చేసి, సీఐ ఆధ్వర్యంలో దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తెగుళ్ల బారిన మిరప

● పెరిగిన పెట్టుబడితో రైతన్న విలవిల

● పంట మార్పిడి లేకనే వైరస్



ఇటిక్యాలలో వైరస్ కారణంగా ఎండిన మిరప

ఇటిక్యాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మిరప రైతులకు తెగుళ్ల కష్టాలు వీడటం లేదు. గత ఏడాది వర్షాలు, గిట్టుబాటు ధర లేక మిరప రైతులు లక్షల్లో నష్టపోయి అప్పుల పాలయ్యారు. ఈ ఏడాదైనా మంచి దిగుబడితో లాభాలు వస్తాయని ఆశించిన రైతన్నకు తెగుళ్ల రూపంలో నిరాశే ఎదురవుతున్నది. జూలై నెలలో సాగు చేసిన మిరప పంట ప్రస్తుతం మంచి పూత, కాయ దశలో ఉంది. అయితే వర్షాలు అధికం కావడంతో తెగుళ్ల ఉధృతి పెరిగింది. గత ఏడాది లాగే ఈసారి కూడా వైరస్ తెగుళ్లు సోకడం నల్ల నల్లి పురుగులు సోకడంతో మిరప కాయలకు మచ్చలు ఏర్పడి కాయలు కూడా నల్లగా మారుతున్నాయని రైతులు తెలుపుతున్నారు. వైరస్ వ్యాధులు సోకడంతో వారానికి రెండుసార్లు మందులు పిచికారి చేస్తున్నా ప్రయోజనం లేకుండా పోతుందని అంటున్నారు. ఒక్కసారి పురుగు మందు పిచికారి చేయాలంటే ఎకరాకు వేల రూపాయలు అవుతున్నాయని రైతులు తెలుపుతున్నారు. పంట మార్పిడి చేయకుండా అదే భూమిలో వరుసగా సాగు చేయడం ద్వారా రకరకాల వైరస్‌లు శిలీంధ్రాల ద్వారా తెగుళ్ల వ్యాప్తి చెందుతున్నాయని వ్యవసాయ అదికారులు తెలుపుచున్నారు. మిరప పంటలకు ఎర్రనల్లి, నల్లనల్లికి తోడు ఆకుముడత సోకడంతో ఏ తెగులును అదుపు చేయాలో తెలియక సతమతమవుతున్నారు.

మండలంలో గత ఏడాది 3వేల ఎకరాలకు పైగా సాగు చేయగా ఈ ఏడాది 10,751 ఎకరాలలో పంట సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు. ఎకరాకు లక్ష రూపాయల వరకు పంట పెట్టుబడి అవుతుందని, ఎకరాకు కనీసం అయిదు క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తే పెట్టుబడి అయినా కొంత తిరిగి వస్తుందని రైతులు అంటున్నారు.

● జాగ్రతలు పాటిస్తే పంట దిగుబడి

- రవికుమార్, వ్యవసాయ అధికారి

పంట సాగు చేసిన నాటి నుంచి రైతులు జాగ్రత్తలు పాటిస్తే పంట దిగుబడి వస్తుంది. మిరప సాగు చేసే రైతులు పంట మార్పిడి చేయాలి. అలాగే వ్యవసాయ అధికారులు సలహాలు తీసుకొని పంటకు అవసరమైన ఎరువులు, విత్తన శుద్ధి చేసి పంటలు సాగు చేయాలి. మండలంలో 10,751 ఎకరాలలో పంట సాగు చేశారు. వైరస్ రసం పీల్చే పురుగు నివారణకు ఆస్‌పెట్, సిప్రోనిల్, థయోమిథాక్ వంటి మందులు వాడి వైరస్‌లను నివారించుకోవచ్చు.

● పంట వాడుముఖం పట్టింది



రెండు ఎకరాలలో మిరప సాగు చేయగా అధిక వర్షాలు, అధిక తేమ ఎక్కువ కావడంతో పంటకు తెగుళ్లు సోకి రకరకాల మందులు వాడినా ప్రయోజనం లేదు. పంట ఎండిపోయే పరిస్థితి రావడంతో కొంత పంట తొలగించాం. ఇప్పటికీ ఎకరాకు లక్ష రూపాయల వరకు పెట్టుబడి పెట్టాం. పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొంది. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- లక్ష్మన్న, రైతు

● కాపు దశలో పంటలు దెబ్బ తింటున్నాయి



నాలుగు ఎకరాలలో మిరప పంట సాగు చేశాను. పంట సాగు మొదట బాగానే ఉంది. వివిధ రకాల వైరస్‌లు సోకడంతో పంటలు దెబ్బతింటున్నాయి. మందులు పిచికారి చేస్తున్నా అదుపుకావడం లేదు. పంట దిగుబడి కోసం రకరకాల ప్రయత్నాలు చేస్తున్నాం. .పంట ఎదుగుదలకు ఎరువులతో పాటు నీళ్ల మందులు వాడుతున్నా అయినా పెట్టుబడులు కూడా తిరిగిరాని పరిస్థితి లేదు.

- రాముడు, రైతు

రాజకీయ ప్రాధాన్యం లేక..

నష్టపోతున్న బీసీలు

» స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి » » బీసీ డెడికేటెడ్ కమిషన్ బహిరంగ విచారణలో నాయకులు



బహిరంగ విచారణలో మాట్లాడుతున్న బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు, హాజరైన వివిధ బీసీ కుల సంఘాల నాయకులు

మహబూబ్‌నగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అత్యధిక జనాభా ఉన్న బీసీలు రాజకీయ ప్రాధాన్యం లేకపోవడంతో నష్టపోతున్నారని బీసీ కుల సంఘాల నాయకులు అభిప్రాయ పడ్డారు. బీసీల్లోని అన్ని కులాల వారికి అవకాశాలు ఇస్తేనే వారి అభివృద్ధి సాధ్యమని చెప్పారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలంగాణ వెనకబడిన తరగతుల డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు నిర్వహించిన బహిరంగ విచారణలో పలు బీసీ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు, రాజకీయ అవకాశాలపై అభిప్రాయాలను వెల్లడించారు. చైర్మన్‌కు వనతిపత్రాలు అందజేశారు. ముందుగా అందరిని హాల్‌లో కూర్చోబెట్టి టోకెన్‌లు జారీ చేశారు. ఆ తరువాత నాయకులు విడతల వారీగా కమిషన్ ముందు హాజరై అభిప్రాయాలు వెల్లడించారు. బీసీ కుల గణన చేపట్టిన తరువాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, ఎన్నికలో 42 శాతం బీసీ రిజర్వేషన్‌లు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. జనాభా అధికంగా ఉన్న కులాలకు జనాభా ప్రకారం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. తక్కువ జనాభా ఉన్న కులాలకు అవకాశాలు రావాలంటే రోస్టర్ పద్ధతిన రిజర్వేషన్లు కేటాయించాలన్నారు. కులగణన చేపట్టాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వారు అభినందించారు.

ఎన్నో చిన్న కులాలకు రాజకీయంగా అవకాశాలు రావడం లేదని, సంచార జాతుల పిల్లలు విద్యాపరంగా ఎంతో నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు కులాల సమస్యలను వెల్లడించేందుకు ప్రయత్నించగా, తాము కేవలం రాజకీయ రిజర్వేషన్లకు సంబంధించిన వివరా లను మాత్రమే తీసుకునేందుకు వచ్చినట్లు చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. త్వరలోనే బీసీ కమిషన్ వస్తుందని, అప్పుడు మీ అభిప్రాయాలు వెల్లడించాలని సూచించారు. అంతకు ముందు ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలో బీసీ రిజర్వేషన్‌లు ఏ విధంగా ఉండాలనే మార్గదర్శకాలు తయారు చేసేందుకు ప్రభుత్వం డెడికేషన్ కమిషన్ ఏర్పాటు చేసిన నెల రోజుల్లో నివేదిక సమర్పించాలని నిర్దేశించిం దన్నారు. దాదాపు మూడు గంటల పాటు సాగిన బహిరంగ విచారణలో చైర్మన్‌తో పాటు మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి, అదనపు కలెక్టర్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అధికారం లేకపోతే న్యాయం జరగదు



ఉమ్మడి పాలమూరు జిల్లాలో యాదవుల జనాభా 18 శాతం ఉన్నా రాజకీయంగా రావలసిన అవకాశాలు రావడం లేదని యాదవ మహాసభ నేత కాశన్నయాదవ్ అన్నారు. రాజకీయ పవర్ లేకుంటే ఆయా కులాలకు న్యాయం జరగదు. కులగణన ఏ కులం శాతం ఎంతో తీసి ఆ ప్రకారంగా స్థానిక సంస్థల ఎన్నికలో అవకాశాలు కల్పించాలి. సింగిల్ విండోలో కూడా రిజర్వేషన్లు అమలుచేయాలి. బీసీలకు 42 శాతం స్థానిక సంస్థలలో అవకాశాలు కల్పించాలి.

- కాశన్నయాదవ్, యాదవ మహాసభ నాయకుడు



బహిరంగ విచారణకు హాజరైన వివిధ కుల సంఘాల నాయకులు

రజకులకు అవకాశం కల్పించాలి



రాష్ట్రంలో 11 లక్షల మంది రజకుల జనాభా ఉంది. అత్యధికంగా కులవృత్తిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఇప్పటికీ చాలా మంది అంటరానివారిగా చూస్తున్నారు. విద్యాపరంగా, ఆర్థికంగా వెనకబడి ఉన్నాం. రాజకీయంగా అవకాశం కల్పిస్తేనే రజకుల అభివృద్ధి సాధ్యం అవుతుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కేటాయించి, ప్రాధాన్యం కల్పించాలి.

- పురుషోత్తం, రజక సంఘం నాయకుడు

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కేటాయించాలి



బీసీ జనాభా 52 శాతం ఉన్నదని ప్రభుత్వమే చేప్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలో వారికి కనీసం 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి. కులగణనలో బీసీల లెక్క తేల్చి, ఆయా కులాలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి. ఏ, బీ, సీ, డీలుగా వర్గీకరించి విద్యా, రాజకీయ అవకాశాలు కల్పించాలి. లేకపోతే అత్యధిక శాతం జనాభా ఉన్న బీసీలు నష్టపోతారు.

- నల్లవెల్లి కురుమూర్తి, బీసీ సంఘం

ముదిరాజ్‌లకు అవకాశాలు రావడం లేదు



బీసీలలో అత్యధిక జనాభా ఉన్న ముదిరాజ్‌లకు ఆ స్థాయిలో రాజకీయ అవకాశాలు రావడం లేదు. రాష్ట్రంలో 8,700 గ్రామాల్లో ముదిరాజ్‌ల జనాభా ఉండగా, అందులో 4,700 గ్రామాల్లో ముదిరాజ్‌ల జనాభా అత్యధికంగా ఉంది. 2,500 గ్రామాల్లో 90 నుంచి 100 శాతం ముదిరాజ్‌లే ఉన్నారు. ఇంత జనాభా ఉన్న ముదిరాజ్‌లకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించకపోవడం వల్ల అన్యాయం జరుగుతోంది.

- జీటీ కృష్ణ, మన ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఒక శాతం అవకాశం కూడా రావడం లేదు



జనాభాలో 15 శాతం ఉన్న ముస్లింలకు రాజకీయాల్లో ఒక శాతం అవకాశాలు కూడా రావడం లేదు. ప్రభుత్వాలను మారిస్తే తప్ప, ముస్లింల తలరాతలు మారడం లేదు. ఉద్యమ సమయంలో 12 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పిన బీఆర్ఎస్ పదేళ్లలో రిజర్వేషన్లు అమలు చేయలేదు. వెనకబడిన జాతులను గుర్తించి స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి.

- ఫారుఖ్‌హుస్సేన్, ఆలిమేవా నాయకుడు.

వాల్మీకులకు రిజర్వేషన్లు కేటాయించాలి



జోగుళాంబ గద్వాల జిల్లాలో వాల్మీకి బోయలు అత్యధిక శాతం జనాభా ఉన్నా రాజకీయంగా అవకాశాలు రావడం లేదు. ఇప్పటివరకు ఒక్కసారి మాత్రం ఎమ్మెల్యేగా అవకాశం దక్కింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో వాల్మీకులకు రిజర్వేషన్లు వర్తింప చేస్తే ఎక్కువ మందికి అంటే, జనాభా ప్రాతిపదికన రాజకీయ అవకాశాలు దక్కుతాయి.

- ఆంజనేయులు, వాల్మీకి సంఘం నాయకుడు

కులగణన చేపట్టడం అభినందనీయం



కులగణన చేపట్టడం అభినందనీయం. కులగణనలో బీసీల జనాభా ఎంతుంటే అంత బీసీలకు రిజర్వేషన్‌లు కల్పించాలి. తమిళనాడులో బీసీలకు 60 శాతం రిజర్వేషన్‌లు ఇస్తున్నట్లుగా ఇక్కడ కూడా జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్‌లు కల్పించాలి. బీసీ గణన తరువాత బీసీల వాటా తేలుతుంది. దాని ప్రకారమే రిజర్వేషన్‌లు కేటాయించాలి.

- గోనెల శ్రీనివాస్, బీసీ సంఘం నాయకుడు

రోస్టర్ పద్ధతిన రిజర్వేషన్లు ఇవ్వాలి



స్థానిక సంస్థల ఎన్నికల్లో గతంలో రొటేషన్ పద్ధతిన రిజర్వేషన్లు అమలు చేసేవారు. 2019న ఆ పద్ధతిని తీసేసి పదేళ్ళు ఒకే రిజర్వేషన్ అని చట్టం చేశారు. అలా కాకుండా రోస్టర్ పద్ధతిలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్‌లు కల్పించాలి. జనాభా ప్రా తిపదికన రిజర్వేషన్‌లు కేటాయిస్తే గ్రామాలలో ఉండే రెండు, మూడు ఇళ్లు ఉండే ఎస్టీలకు అవకాశాలు దక్కవని, అందుకే రోస్టర్‌ను అమలు చేయాలి.

- బాలలింగయ్య, ఎరుకల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు

రాజకీయ అవకాశాలు వచ్చేలా రిజర్వేషన్లు



స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తేనే అన్ని కులాలకు రాజకీయ అవకాశాలు లభిస్తాయి. నగరులు సంచారజాతులు కావడంతో, వారి పిల్లలు విద్యాపరంగా నష్టపోతున్నారు. వారిని బీసీ-డీ నుంచి బీసీ-ఏ లో చేర్చాలి. కులగణన తరువాతనే ఎన్నికలకు వెళ్ళాలి.

- ప్రణీల్‌చందర్, నగరసంఘం నాయకుడు

రాజకీయంగా అవకాశాలు కోల్పోతున్నాం



ముస్లింలకు రాజకీయ అవకాశాలు రావడం లేదు. ముస్లింలలో ఎంతోమంది నిరుపేదలు ఉన్నారు. చదువు లేకపోవడం వల్ల ఎంతో మంది డ్రైవర్‌లుగా, మెకానిక్‌లుగా పని చేస్తున్నారు. బీసీ రిజర్వేషన్ కోటాలోనే ముస్లింలు కూడా పోటీ చేయడం వల్ల ముస్లింలకు అవకాశాలు రావడం లేదు. అలాకాకుండా విద్యారంగంలో ఇస్తున్నట్లుగా ఏ, బీ, సీ, డీ, ఈ ప్రకారంగా రాజకీయ రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉంది.

- జాకిర్, ఎంఐఎం నాయకుడు

స్పోర్ట్స్ బాక్స్

గో-గేమ్ టోర్నీలో స్వర్ణ, కాంస్య పతకాలు



టోర్నీలో పతకాలు సాధించిన క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబర్ 18 : మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి గో-గేమ్ టోర్నీ, సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన క్రీడాకారులు సత్తా చాటారు. టోర్నీలో చేతన్‌చంద్ర, శిరీష, హారిక, మహ్మద్ రయ్యాన్ బంగారు, బషీర్ కాంస్య పతకాలు సాధించారు. వారిని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నసురుల్లా హైదర్, వైస్ ప్రెసిడెంట్ మహ్మద్‌షకీల్ అహ్మద్, కార్యదర్శి అఫ్రోజ్, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక

మిడ్జిల్, నవంబరు 18 : (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని వస్పుల ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఎంఈవో సుధాకర్, హెచ్ఎం వెంకటయ్య, ఫిజికల్ డైరెక్టర్ శంకర్‌నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్చర్ల పట్టణంలోని మినీ స్టేడియంలో సోమవారం నిర్వహించిన ఎంపిక పోటీల్లో పాఠశాల నుంచి 15 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. వారిలో స్వప్న, అనిత, మాధవి, అర్పితలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 29 నుంచి వచ్చేనెల ఒకటవ తేదీ వరకు నిజామాబాద్ జిల్లా ఆలూరు మండలం కల్లాడి గ్రామంలో నిర్వహించనున్న అంతర్ జిల్లాల రాష్ట్ర రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో వారు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు సునిత, కృపారాణి, భానుప్రకాష్‌రాజా, హరిశంకర్, బాసయ్య తదితరులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలను విజయవంతం చేయాలి



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి క్రాస్ కంట్రీ పోటీలను విజయవంతం చేయాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. డిసెంబరు 22 నుంచి నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్ పోటీల వాల్‌పోస్టర్‌ను కల్వకుర్తి పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులు ఠాకూర్ బాలాజీసింగ్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఈ పోటీల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 1,100 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బ్యాంగి ఆనంద్‌కుమార్,అథ్లెటిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సోలపోగుల స్వాములు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితీ విజయ్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు సతీష్, రాంరెడ్డి, రవి, రామస్వామి, సంయుక్త కార్యదర్శి అంజయ్య, పీడీ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

జిన్నింగ్‌లో కన్నింగ్

(మొదటి పేజీ తరువాయి)

రైతులను ఆర్గనైజర్లు బందీ చేస్తున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో అత్యధిక మంది ఆర్గనైజర్లకు జిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. ఓ వైపు ఫౌండేషన్ సీడ్, అప్పులు ఇచ్చి మరోవైపు జిన్నింగ్‌లో కన్నింగ్‌కు పాల్పడుతూ దోపిడీ చేస్తూనే ఉన్నారు. అధికారులు ఇదంతా చూస్తూనే ఉన్నప్పటికీ వారిని నియంత్రించే దిశగా చర్యలు తీసుకోవడం లేదు. ఎన్నిసార్లు సమీక్ష సమావేశాలు నిర్వహించినప్పటికీ, జిల్లా కాటన్ సీడ్‌కు హబ్‌గా పేరు గాంచినా రైతులకు న్యాయం జరిగేలా మాత్రం చూడటం లేదనే విమర్శలున్నాయి.

ప్రాసెసింగ్ ఫీజు దోపిడీ...

జిన్నింగ్ మిల్లు నిర్వాహకులు ప్రాసెసింగ్ ఫీజులో భారీగా దోపిడీకి పాల్పడుతున్నారు. సాధారణంగా ఫౌండేషన్ సీడ్ ఇచ్చి పంట సాగుకు సహకరించిన ఆర్గనైజర్, కంపెనీకి సదరు సీడ్ రైతు పత్తిని విక్రయిస్తారు. ఎక్కువ మంది ఆర్గనైజర్లకే మిల్లులు ఉండటంతో మొత్తం తెచ్చిన పత్తిని తూకం వేసి దాన్ని డీలింటింగ్ చేస్తారు. సీసీఐ నిబంధనల ప్రకారం ఒక్కో కేజీకి ఏడు రూపాయల వరకు ప్రాసెసింగ్ ఫీజు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ, నిబంధనలకు విరుద్ధంగా కేజీకి దాదాపు రూ. 13 ఫీజు వసూలు చేస్తున్నారు. అది కూడా కేవలం గింజలు పోను మిగిలిన దూది ఎంత తూకం వస్తుందో దానికే వసూలు చేయాల్సి ఉండగా గింజలకు కూడా ప్రాసెసింగ్ ఫీజును వసూలు చేస్తున్నారు.

ఉదాహరణకు..

ఒక సీడ్ రైతు 10 క్వింటాళ్ల పత్తిని తీసుకువస్తే అందులో సుమారు ఏడు క్వింటాళ్ల మేర విత్తనాలు వస్తాయి. దాదాపు మూడు క్వింటాళ్ల దూది వస్తుంది. ఆ దూదికి మాత్రమే రైతు నుంచి ప్రాసెసింగ్ ఫీజును వసూలు చేయాల్సి ఉంటుంది. కానీ, మొత్తం పది క్వింటాళ్లకు కిలోకు రూ. 13 చొప్పున వసూలు చేస్తున్నారు. ఓ వైపు సీసీఐ నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ ఫీజు తీసుకోవడం, మరోవైపు గింజలకు కూడా ఫీజు వసూలు చేయడంతో రైతులు దోపిడీకి గురవుతున్నారు. అలాగే దూదిని రైతుల సమక్షంలో తూకం వేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. రైతు పత్తి అప్పగించిన తర్వాత జిన్నింగ్ మిల్లింగ్ నిర్వాహకులు ఇంత తూకం అయ్యిందని చెప్పి దాన్ని విక్రయించుకుంటున్నారు. దూది లోనూ మోసాలకు పాల్పడుతున్నారు. అలాగే బహిరంగ మార్కెట్‌లో దూదికి వచ్చే రేటు కంటే తక్కువ ధరనే రైతులకు చెల్లిస్తు న్నారు. ఒకవేళ రైతు ఆ దూదిని తీసుకెళ్లి విక్రయించాలంటే.. రవాణా ఖర్చు అదనపు భారం అవుతుండటంతో వారు చెప్పిన తూకం.. ఇచ్చిన ధరకు రైతులు ఒప్పుకో వాల్సిన దుస్థితి ఉన్నది.

రైతులకు అండగా ప్రభుత్వం



తాడిపర్తిలోని కొనుగోలు కేంద్రంలో వడ్లను పరిశీలిస్తున్న జిల్లెల చిన్నారెడ్డి

గోపాల్‌పేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని లక్ష్మీ తండా, తాడిపర్తి, చాకల్‌పల్లి గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో ముచ్చటించారు. పంటల సాగు, దిగుబడులు తదితర విషయాలను తెలుసుకున్నారు. ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే తనను నేరుగా కలవచ్చని సూచించారు. అనంతరం వడ్ల కాంటాకు కొబ్బరి కాయ కొట్టి ధాన్యం కొనుగోలును ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం, పార్టీపై కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారని, వారి మాటలు నమ్మొద్దన్నారు. సన్నరకం వడ్లు పండించిన రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పినట్లుగా బోనస్ ఇస్తోందని స్పష్టం చేశారు. రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, ఎవరూ అపోహలకు గురికావద్దని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. రైతులకు ఇబ్బందులకు గురిచేస్తే, బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా మార్కెట్ కమిటీ చైర్మెన్ శ్రీనివాస్ గౌడ్, నాయకులు సత్యశీలారెడ్డి, ఉప్పరి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక వేధింపుల కేసులో

నిందితుడికి జైలు శిక్ష

గద్వాల క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : బాలికను లైంగికంగా వేధించి, అత్యాచారయత్నం చేసిన కేసులో నిందితుడికి ఏడాది జైలుశిక్షతో పాటు రెండు వేల రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయాధికారి కె.కుష తీర్పు వెల్లడించారు. ఇందుకు సంబంధించి స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆనంద్‌కుమార్, ధరూర్ ఎస్ఐ అబ్దుల్ షకూర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా, ధరూర్ మండల పరిధిలోని వామన్‌పల్లి గ్రామానికి చెందిన నీలబావి చిన్న అంజనేయులు అనే వ్యక్తి తన పొలంలో ఓ బాలికతో పనులు చేయించేవాడు. 2021 సంవత్సరంలో ఒక రోజు పొలం పనులు ముగిశాక, ఆ బాలికను బైక్‌పై ఎక్కించుకొని వెళ్తూ, మార్గంమధ్యలో బండి ఆపి లైంగికంగా వేధించి అత్యాచారం చేసేందుకు ప్రయత్నించగా, బాలిక తప్పించుకొని వెళ్లి విషయాన్ని తల్లిదండ్రులకు తెలిపింది. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసుపై సోమవారం జిల్లా కోర్టులో సాక్షులను విచారించారు. వాదోపవాదాల అనంతరం నిందితుడు నీలబావి చిన్న అంజనేయులకు ఏడాది జైలు శిక్షతో పాటు, రెండు వేల రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయాధికారి కె. కుష తీర్పు వెల్లడించారు.

మహిళపై అసభ్య ప్రవర్తన

నిందితుడికి జైలు శిక్ష, జరిమానా

కొల్లాపూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మహిళపై అసభ్యంగా ప్రవర్తించి, దూషించిన కేసులో ఓ వ్యక్తికి జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించారు. కేసుకు సంబంధించి ఏపీపీ శిరీష తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుంటి లింగయ్య అనే వ్యక్తి తనను దుర్భాషలాడి, అసభ్యంగా ప్రవర్తించాడని ఓ మహిళ నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని కోడేరు పోలీస్ స్టేషన్‌లో 2022లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ కృష్ణ ఓబుల్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహించారు. ఈ కేసుపై కొల్లాపూర్ కోర్టులో విచారణ జరిగింది. నిందితుడికి నాలుగువేల జరిమానా, ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు, మరో వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ సోమవారం ఒకటో అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి జ్యోత్స్న గుంటి తీర్పు వెల్లడించారు.

కోర్టు ప్రాంగణాన్ని శుభ్రం చేయాలి

» డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి శిక్ష

కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఓ వ్యక్తికి ఒక రోజు కోర్టు ప్రాంగణాన్ని శుభ్రం చేయాలంటూ న్యాయాధికారి శిక్ష విధించారు. ఎస్ఐ వి.సతీష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, తెలకపల్లి మండలంలోని పెద్దపల్లి గ్రామానికి చెందిన తలాడి ఈశ్వర్ అనే వ్యక్తి ఈనెల మూడున మద్యం తాగి వాహనం నడుపుకుంటూ పెద్దకొత్తపల్లి మండలం నాయినోని మైసమ్మ వద్దకు వస్తుండగా మార్గం మధ్యలో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం కోర్టు కానిస్టేబుల్ రాముడు నిందితుడిని సోమవారం కొల్లాపూర్ కోర్టులో హాజరు పరిచారు. వాదోపవాదాల అనంతరం ఒక రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కోర్టు ఆవరణను శుభ్రం చేయాలంటూ న్యాయాధికారి జ్యోత్స్న గుంటి తీర్పు వెల్లడించిటన్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

మూసాపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. సోమవారం జరిగిన ఈ సంఘటనపై ఎస్ఐ పీ శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలంలోని గుడిదొడ్డి గ్రామానికి చెందిన వడ్డె హనువంతు, భార్య వడ్డె భీమమ్మ (40)తో కలిసి ద్విచక్రవహనంపై షాద్‌నగర్ నుంచి అయిజకు బయలుదేరాడు. మూసాపేట మండలంలోని జానంపేట వద్ద వారి బైక్‌ను హైదరాబాద్ నుంచి కర్నూల్‌కు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో రోడ్డుపై పడిపోయిన వడ్డె భీమమ్మ తలపై నుంచి వాహనం వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. హనుమంతుకు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంటర్వ్యూ..



పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి

- మండల పశువైద్య అధికారి ఆంజనేయులు

గోపాల్‌పేట, నవంబరు, 18 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతులు పశువులకు ముఖ్యంగా వర్షా కాలం చలికాలంలో ఎక్కువ రోగల బారిన ప డుతాయిని, పాడి రైతులు అప్రమంతగా ఉం డాలని మండల పశువైద్య అధికారి అంజనే యులు సోమవారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

మండలంలోని పశువులకి టీకాలు వేస్తున్నారా?

వానా కాలం చలి కాలంలో పశువులు ఎక్కువగా రోగాల బారిన పడుతుంటాయి. ముందస్తుగానే మండలంలో గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశాం.

ఎన్ని పశువులకు టీకాలు వేశారు?

ఇప్పటికే మండలంలోని అన్ని గ్రామాల్లో ఉండే పశువైద్య సిబ్బంది ద్వారా 7,240 పశువులకు టీకాలు వేశాం

మరి గొర్రెల పరిస్థితి ఏంటీ?

ఈ కాలంలో గొర్రెలకు పారుడు రోగం వస్తుంటుంది. గొర్రెల కాపరులు ఈ రోగాన్ని గుర్తుపట్టి పశువైద్యులకు సమాచారం అందిస్తే.. పశువైద్య సిబ్బంది గొర్రెల మంద వద్దకు వచ్చి టీకాలు వేస్తాం.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు ఎస్ఐ నరేందర్ పట్టణ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడారు. అపరిచిత వ్యక్తుల నుంచి మీ అకౌంట్‌కు సంబంధించిన ఫోన్ కాల్స్ నమ్మవద్దని, ఫోన్ కాల్స్ చేసి ఓటీపీ నంబర్ చెప్పాలని కోరిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. బ్యాంకు అధికారులు అయితే నేరుగా బ్యాంక్‌కు రప్పించుకొని వివరాలు సేకరిస్తారని, అపరిచితుల వ్యక్తుల నుంచి ఫోన్ కాల్స్ వస్తే సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

వనపర్తి టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి మౌలిక వసతులు ప్రభుత్వమే పూర్తి బాధ్యతతో కల్పించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వీరపాగ రామకృ ష్ణ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కే ంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌ను డీఎస్పీ నాయకులు కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రాష్ట్రంలోని 90 శాతం మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు ఈ ఐదింటిని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్రంలోని విద్యార్థులందరికీ నాణ్యమైన ఉచిత విద్యను కల్పించాలని, మూడున్నర కోట్ల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీలకు, 18 సంవత్సరాలు నిండిన ప్రతీ పౌరుడికి ఉపాధి అవకాశాలను కల్పించాలన్నారు. నిరుపేదలుగా జీవిస్తున్నటువంటి ప్రజలకు నీటి వసతితో కలిగిన ఒక ఎకరం భూమిని, ఇల్లు లేని ప్రతీ ఒక్కరికి 200 గజాల స్థలం నాలుగు గుదుల ఇంటిని నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చెప్పుకొంటున్న ఆరు గ్యారెంటీలు వద్దని, ప్రజలకు కావాల్సిన ఐదు వసతులను అత్యవసరంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లస్వామి, బంకల ఆంజనేయులు మహారాజ్, బలరాం, లక్ష్మణ్, నాగరాజు, వీరయ్య, రాము, రవి పాల్గొన్నారు.

పాత బస్టాండ్‌ను అందుబాటులోకి తేవాలి



పాత బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఐక్యవేదిక నాయకులు

వనపర్తి టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కొన్ని దశాబ్దాలుగా నిరుపయోగంగా ఉన్న పాత బస్టాండ్ ను త్వరగా ప్రజలకు అందుబాటులోకి తేవాలని అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్ అన్నారు. సోమవారం అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు పాత బస్టాండ్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వనపర్తి రాజు రాజా రామేశ్వరరావు బస్టాండ్ ప్రారంభం అయినప్పుడు పాత బస్టాండ్ కోసం స్థలం కేటాయించి లీజుకు ఇవ్వడం జరిగిందని, అప్పటి నుంచి 50 సంవత్సరాల పాటు వనపర్తి చుట్టుపక్కల గ్రామాల ప్రయాణికులకు పాత బస్టాండ్ నుంచి రవాణా పరమైన సేవలందించిందని అన్నారు. కొత్తకోట, మదనాపూర్, ఆత్మకూరు మార్గాలకే కాకుండా పెద్దమందడి, మహబూబ్‌నగర్ వివిధ మండలాలకు వెళ్లే ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేరవేస్తున్న తరుణంలో గత కొన్ని సంవత్సరాల క్రితం కొందరు తమ సొంత ప్రయోజనాలకు పాత బస్టాండ్ ఆక్రయించి కమర్షియల్‌గా ఉపయోగించుకున్నారని తెలిపారు. అఖిపక్ష ఐక్యవేదిక నాయకులు వెంకటేశ్వర్లు, టీడీపీ రాష్ట్ర నాయకులు కొత్త గొల్ల శంకర్, బీసీ నాయకులు గౌనికాడి యాదయ్య, బీఎస్పీ పట్టణ అధ్యక్షుడు గంధం భరత్, నాయకులు బొడ్డుపల్లి సతీష్, శివకుమార్, రమేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లకు కొర్రీలు

- వెలవెలబోతున్న కొనుగోలు కేంద్రాలు
- ప్రైవేటు మార్కెట్‌కు తరలుతున్న ధాన్యం



ఎండలో తూర్పు పడుతున్న రైతులు



కొనుగోలు కేంద్రాల్లో కవర్లపై ఆరబోసిన వరి

ఖిల్లాఘణపురం, నవంబరు 18, (ఆంధ్రజ్యోతి) : కర్షకులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని విక్రయించడానికి కొనుగోలు కేంద్రాలకు తరలిస్తే కొత్తగా ప్రభుత్వ నిబంధనల పేరుతో ధాన్యం కొనుగోలు చేయడానికి కొర్రీలు పెడుతున్నారని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులు పంట పండించడం ఒక ఎత్తయితే దానిని విక్రయించడం పెను సవాల్‌గా మారుతుంది. ధాన్యమును తేమశాతం రావడానికి రోజుల తరబడి ఆరబెట్టడం, తాలు, కట్టెపుల్లలు, బెరికలు ఉన్నాయని రైస్ మిల్లర్లు ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోతున్నారు. దీనికి తోడు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లో నిరీక్షించలేక కొంత మంది రైతులు పండించిన ధాన్యాన్ని తక్కువ ధరకు ప్రైవేటు మార్కెట్‌కు తరలిస్తున్నారు. వనపర్తి జిల్లాలో వానాకాలం సీజన్‌లో అధికారులు సుమారు 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేయడానికి అంచనాలు వేశారు కానీ నేటి వరకు 3,258 టన్నుల వరి సేకరణ జరిగింది. ప్రభుత్వం గత సీజన్‌లో 1,36,000 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం సేకరణ చేశారు. పీఏసీఎస్, ఐకేపీ ద్వారా వరి ధాన్యం కొనుగోలు ప్రారంభమై 20 రోజులు గడుస్తున్నా.. ధాన్యం సేకరణ నత్తనడక నడుస్తుందని రైతులు వాపోతున్నారు.

20 రోజులుగా నిరీక్షిస్తున్నాం..



వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తరలించి 20 రోజులైనా ప్రభుత్వం ధాన్యాన్ని నిబంధనల పేరుతో సేకరించడం జాప్యం చేస్తున్నారు. బోనస్ రూ.500 కోసం అష్టకష్టాలు పడుతున్నాం. రోజూ ధాన్యానికి కాపలా ఉండడం ఇబ్బందిగా మారింది.

- కుర్వ శ్రీశైలం, రైతు ఖిల్లాఘణపురం

నిబంధనల ప్రకారం చేస్తున్నాం..



వరి ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ నిబంధనల మేరకే వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు తేమ శాతం, తాలు లేకుండా ఉండే ధాన్యాన్ని సర్టిఫై చేసి టోకెన్ వేస్తున్నాం. రైతులు ధాన్యాన్ని ఆరబోసి తాలు, మట్టి లేకుండా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలి.

- మల్లయ్య, ఏవో ఖిల్లాఘణపురం

పోలీస్ ప్రజావాణికి ఏడు ఫిర్యాదులు

వనపర్తి క్రైమ్, నవంబరు 18, (ఆంధ్రజ్యోతి) : జిల్లా పో లీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఏడు ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు. ఫిర్యాదుదారులతో మాట్లాడి ఆయన వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజావాణికి వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు.

ప్రజావాణి ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పదిలో అత్యుత్తమ ఫలితాలు సాధించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో గోవిందరాజులు

ఖిల్లాఘణపురం, నవంబరు 18, (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలను డీఈవో గోవిందరాజులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు గణితం తెలుగు సబ్జెక్టులపై ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా ప్రతీ రోజు పాఠశాలకు రావాలని పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. విద్యార్థులను గ్రూపులుగా విభజించి వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పది విద్యార్థులకు సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహించి సిలబస్ ప్రకారం ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను రివిజన్ చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాళిదాస్, మునావర్ సుల్తానా, ఉపాధ్యాయులు శ్రీనివాస్ యాదవ్, కృష్ణమోహన్, రామకృష్ణ పాల్గొన్నారు.

విజయ తీరాలకు చేరుకోవాలి

పాన్‌గల్ : విద్యార్థులు ఇష్టపడి చదివి విజయతీరాలకు చేరుకోవాలని ఎంఈవో బి.శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండల పరిధిలోని తెల్లరాళ్లపల్లి గ్రామంలోని లిటిల్ స్టార్స్ హైస్కూల్‌లో విద్యార్థులకు శిలా నువ్వే శిల్పివి నువ్వే అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పుస్తకాల్లోని విద్యతో పాటు సమాజంపై అవగాహన పెంచుకోవాలన్నారు. శివ, నాగరాజు, బాలరాజు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేపై కళాజాతా



సమగ్ర సర్వేపై అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం

ఖిల్లాఘణపురం, నవంబరు 18, (ఆంధ్రజ్యోతి) : ఇంటింటి సమగ్ర సామాజిక విద్యా ఉపాధి రాజకీయ ఆర్థిక కుల గణన సర్వేతో ప్రజలకు కలిగే ప్రయోజనాలను కళాజాతా బృందం ఆటపాటలతో ప్రజలకు అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో సోమవారం కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశాల మేరకు సమాచార పౌర సంబంధాల శాఖ జిల్లా అధికారి సీతారాం ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం సమగ్ర కుల సామాజిక ఇంటింటి సర్వేలో ఇంటికి వచ్చే ఎన్యుమరేటర్లకు సహకరించి ప్రతీ అంశాన్ని తెలిపి తప్పులు లేకుండా నమోదు చేయించాలని వివరించారు. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను కళా ప్రదర్శన ద్వారా వివరించారు. రవితేజ రెడ్డి, తెలంగాణ సాంస్కృతిక సారథి టీం లీడర్ గుడిసె శివలింగం, కళాకారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

పాన్‌గల్, నవంబరు 18, (ఆంధ్రజ్యోతి) : ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన మండల పరిధిలోని కిష్టాపూర్ తండాకు చెందిన కిషోర్‌నాయక్ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పరామర్శించారు. సోమవారం గ్రామానికి చేరుకుని బాధితుడి మృతికి కారణాలు, కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడొద్దని కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. కిషోర్ నాయక్ చిత్రపటానికి నివాళుల ర్పించారు.

దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల..

మదనాపురం : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులను మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. మండలంలోని దుప్పల్లికి చెందిన గొల్ల లక్ష్మయ్య, కురుమూర్తి, నెల్విడికి చెందిన రాములు అనారోగ్యంతో మహబూబ్‌నగర్‌లోని వివిధ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఆయన వారిని పరామర్శించారు.

కాల్వలో పడిన గేదెలను కాపాడిన అగ్నిమాపక అధికారులు

కొత్తకోట, నవంబరు 18, (ఆంధ్రజ్యోతి) : భీమా కాల్వలో పడిన గేదెలను అగ్నిమాపక, బీఆర్ఎస్ నాయకులు కాపడిన సంఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. వడ్డెవాటకి చెందిన రైతు నాగమ్మకు చెందిన ఏడు పాడిగేదెలు నీళ్లు తాగేందుకు కాల్వలోకి దిగాయి. నీటి ప్రవాహం ఎక్కువ కావడంతో నీటి ఉధృతికి కొట్టుకుపోయాయి. గమనించిన నాగమ్మ కేకలు వేయడంతో నాటవెళ్లి గ్రామం వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు గమనించి అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ దేవేదంర్‌రెడ్డి సిబ్బంది వచ్చి తాళ్ల సహాయంతో గేదెలను కాపడే ప్రయత్నం చేశారు. వారికి తోడుగా బీఆర్ఎస్ నాయకులు నీటిలోకి దిగి గేదెలను బయటకు తీసుకొచ్చారు. పాడిగేదెలను కాపడిన ఫైర్ సిబ్బంది, బీఆర్ఎస్ నాయకులు విశ్వేశ్వర్, బాలయ్య నాయుడులకు నాగమ్మ కృతజ్ఞతలు తెలిపారు.

జీవో ప్రకారం వేతనాలు ఇవ్వాలి

ఆత్మకూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ వర్కర్స్‌కు జీవో నంబర్ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని టీయూసీఐ ఆధ్వర్యంలో పంచాయతీ రాష్ట్ర కమిషనర్ శ్రీజనను హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు 60వేల మందికి పైగా ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు రూ.9,500 నెల వేతనం మాత్రమే ఇస్తూ.. కార్మికుల పొట్ట కొడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంకటేష్, హనుమంతు సాంబశివుడు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష దీపోత్సవం



దీపాలు వెలిగిస్తున్న మహిళలు

అమరచింత, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నాగల్‌కడుమూర్‌లో విశ్వకర్మ జగద్గురు దేవేంద్రాచార్య మహా స్వాముల మఠంలో కార్తీకమాసం మూడో సోమవారం రాత్రి భక్తిశ్రద్ధలతో లక్ష దీపోత్సవం కార్యక్రమం నిర్వహించారు. దేవేంద్రాచార్య మఠంలో ప్రత్యేక పూజలు జరిపి మఠం ఆవరణలో లక్ష దీపోత్సవంలో మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించారు.

న్యూస్ బాక్స్

నేడు కల్వరాలలో వైద్య శిబిరం

వీపనగండ్ల, నవంబరు 18, (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కల్వరాలలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నాగర్‌కర్నూల్ జిల్లా అధికారి కల్వరాల నరసింహ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉదయం 10 గంటలకు వైద్య శిబిరం ప్రారంభమవుతుందని, అన్ని రకాల విభాగాలకు చెందిన వైద్యులు పాల్గొననున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

21న దివ్యాంగులకు ఆటల పోటీలు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, నవంబరు 18, (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో దివ్యాంగులకు ఆట పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారిని లక్ష్మమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ ఆటల పోటీలను కలెక్టర్ ఆదర్శ్ సురభి హాజరై ప్రారంభిస్తారని అన్నారు. పరుగు పందెం, షార్ట్‌పుట్, క్యారమ్స్, చెస్ తదితర ఆటల పోటీలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. దివ్యాంగులు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

24న కరాటే అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం

వనపర్తి అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని రెయిన్‌బో పాఠశాలలో ఈ నెల 24న కరాటే అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపు గోపాల్ తెలిపారు. తెలంగాణ స్పోర్ట్స్ కరాటే రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లాలోని ప్రతీ కరాటే మాస్టర్ ఈ సమావేశానికి రావాలని కోరారు. తెలంగాణ స్టేట్ స్పోర్ట్స్ కరాటే వారు ఈ జనరల్ బాడీ సమావేశానికి ఒకరు హైదరాబాద్ నుంచి అబ్జర్వర్‌గా రానున్నారని చెప్పారు. కొన్ని సంవత్సరాల నుంచి కరాటేకు గుర్తింపు లేకపోవడంతో ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వంలో ఎమ్మెల్సీ అయిన తెలంగాణ స్పోర్ట్స్ కరాటే రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ప్రధాన పాత్రలో వ్యవహరించడం మన అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కరాటేను అతని ఆధ్వర్యంలో ఒక క్రీడగా తీసుకుపోవడమే లక్ష్యంగా పెట్టుకొని ప్రతి జిల్లాలో జనరల్ బాడీ మీటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి జిల్లాకు ఒక స్టేట్ బాడీ నుంచి ఒక అబ్జర్వర్‌ని పంపించడం జరుగుతుందని, ఈ సమావేశానికి ప్రతీఒక్క కరాటే మాస్టర్ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తు

కొత్తకోట, నవంబరు 18, (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆరు కేంద్రాల్లో జరిగిన గ్రూప్ -3 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పరీక్షల రెండో రోజు సోమవారం 1,309 మంది పరీక్ష రావాల్సి ఉండగా.. 541 మంది హాజరు కాగా.. 768 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున నలుగురి కంటే ఎక్కువ మందిని తిరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సీఐ రాంబాబు, ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి పర్యవేక్షించారు.

బకాయిలు వెంటనే చెల్లించాలి



నినాదాలు చేస్తున్న కార్మికులు

వనపర్తి టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కార్మికుల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్ట ఆంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వనపర్తి మునిసిపల్ కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యంతో ఐదో తేదీ లోపు ఇవ్వాల్సిన వేతనాలు ప్రతీ నెల ఆలస్యంగా ఇస్తున్నారని అన్నారు. వాటర్ వర్క్స్‌కు ఒకసారి, శానిటేషన్ వర్కర్స్‌కు మరోసారి వేతనాలు చెల్లిస్తూ విభజించి పాలిస్తున్నారని అన్నారు. దీంతో 20వ తేదీ వరకు వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. 20వ తేదీ వరకు పూర్తి వేతనాలు ఇవ్వకుంటే 21న కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. గడ్డం కురుమయ్య, బాలు, లాలు, గోపాల్, యాదగిరి, కురుమూర్తి, వెంకటమ్మ, రాణి, జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలి



పాన్‌గల్‌లో అగాహన కల్పిస్తున్న ఏవో

పెబ్బేర్ రూరల్, నవంబరు, 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని రైతులకు ఇబ్బందులు కలుగకుండా తూకాలు చేయాలని పెబ్బేర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమోదిని అన్నారు. సోమవారం మండలంలోని తిప్పాయిపల్లి, గుమ్మడం, అయ్యవారిపల్లి, పాతపల్లి గ్రామాల్లో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

సందర్శించిన వ్యవసాయ అధికారి

పాన్‌గల్ : మండల కేంద్రంతో పాటు కొత్తపేటలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం మండల వ్యవసాయ అధికారి రాజవర్ధన్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో ధాన్యం నాణ్యత, తేమ శాతం సరైన పద్ధతిలో ఏ విధంగా కొనుగోలు చేయాలో వాటి ప్రమాణాలు అక్కడి రైతులకు, వరి కొనుగోలు కేంద్రం ఇన్‌చారిలకు అవగాహన కల్పించారు.

పాన్‌గల్ మండల పరిధిలోని రాయినిపల్లి లో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్‌సాగర్‌తో కలిసి డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి ప్రారంభించారు.

చిన్నంబావి : మండల పరిదిలోని బెక్కెం, అమ్మాయిపల్లిలో నరసింహరెడ్డి ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని విష్ణువర్ధన్ ప్రారంభించారు.

వక్ఫ్ బోర్డు అధికారిని తొలగించాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఖాదర్ పాషా

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పాలమూరు జిల్లా ఇన్‌చార్జ్‌గా పని చేస్తున్న వక్ఫ్ బోర్డు అధికారిని వెంటనే విధుల నుంచి తొలగించాలని తెలంగాణ జన సమితి వనపర్తి జిల్లా అధ్యక్షుడు ఖాదర్ పాషా కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌ను ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉమ్మడి పాలమూరు వక్ఫ్ బోర్డు ఇన్‌చార్జ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న సిరాజుద్దీన్ వక్ఫ్ ఆస్తులు రక్షించలేని స్థితిలో ఉన్నారన్నారు. కొత్తకోట మండలంలోని నాటవెల్లి గ్రామం, వనపర్తి టౌన్‌లో వక్ఫ్ ఆస్తులు కబ్జాకు గురవుతున్నా సదరు అధికారి చూసీ చూడనట్లు ఉన్నారని తెలిపారు. వక్ఫ్ ఆస్తుల్లో అక్రమంగా వెంచర్లు, ప్లాటు దాబాలు, హోటల్స్ కట్టడం జరుగుతుందని వీటిపై ఎలాంటి పర్యవేక్షణ చేయట్లేదని వివరించారు. వక్ఫ్ ఆస్తుల అన్యాక్రాంతం కాకుండా ఇన్‌చార్జ్‌గా ఉన్న సిరాజుద్దీన్‌ను తొలగించి జిల్లాకు కొత్త అధికారిని నియమించాలని కోరుతున్నట్లు తెలిపారు.

చదువుతోనే బాలలకు ఉజ్వల భవిష్యత్తు



బాల్య వివాహాల నిర్మూలన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సుమ

కొత్తకోట, నవంబరు18, (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దని మహిళా సాధికారత కేంద్రం స్పెషలిస్టు ఫైనాన్షియల్ లిటరసీ సుమ అన్నారు. సోమవారం సంకిరెడ్డిపల్లి గ్రామ ఉన్నత పాఠశాలలో సైబర్, క్రైం, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమ మాట్లాడారు. బాలికలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాతే పెళ్లిళ్లు చేయాలన్నారు. కుటుంబ ఆచారామంటూ 10, 12 ఏళ్లకు వివాహం చేస్తే బాల్య వివాహాల నిరోధక చట్టం 2006 ప్రకారంగా జైలు జీవితం గడపాల్సి ఉంటుందన్నారు. కొందరు విద్యార్థులు ఫైఫై అంటూ సోషల్ మీడియాలో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లో చాటింగ్ చేస్తూ గుర్తు తెలియని వ్యక్తులకు దగ్గరై నష్టపోతున్న సంఘటనలు ఎన్నో జరిగాయని గుర్తు చేశారు. బాలికలు ఏదైన ప్రమాదంలో పడితే టోల్ ఫ్రీ నంబరు 1098, సైబర్‌క్రైం అయితే 1930 నంబరులకు ఫోన్ చేసి ప్రమాదం నుంచి బయట పడాలన్నారు.

సదస్సులో పాఠశాల ఉపాధ్యా యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన బీసీలకు ప్రాధాన్యం కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న బీసీ కులాల నాయకులు

ఖిల్లాఘణపురం, నవంబరు 18, (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో జనాభా ప్రాతిపదికన బీసీలకు ప్రాధాన్యత కల్పించాలని వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు దాసర్ల భూమయ్య, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు దేవరకొండ విజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ వెనుకబడిన తరగతుల డెడికేటెడ్ కమిషనర్ బూసాని వెంకటేశ్వరరావు రిటైర్డ్ ఐఏఎస్‌కు మహబూబ్‌నగర్ జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలో సోమవారం ఏర్పాటు చేసిన బీసీ కులాల సమావేవంలో వారు పాల్గొని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ గుర్తింపు అంశంపై వారు మాట్లాడారు. బీసీలు సామాజికంగా, విద్యారంగ పరంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు శ్రీనివాసులు, లక్ష్మయ్య, వెంకటేష్, మాధవులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కుటుంబ సమగ్ర సర్వే

అమరచింత, నవంబరు 18, (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కుటుంబ సమగ్ర సర్వే ఆదివారం ఆయా గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా మునిసిపాలిటీ కేంద్రంతో పాటు నాగల్‌కడుమూర్, నందిమల్ల, కృష్ణంపల్లి, మిట్టనందిమల్ల, చంద్రఘడ్, నందిమల్ల ఎక్స్‌రోడ్డు, పామిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో సర్వే కొనసాగింది. ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేను తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఏపీఎం శ్రీనివాసులు, ఆర్ఐ గోపాల్, ఎంపీవో నరసింహయ్య, ఎంఈవో భాస్కర్ సింగ్ తదితర అధికారులు పర్యవేక్షించారు.

వేతనాలు చెల్లించాలని అదనపు కలెక్టర్‌కు వినతి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అమరచింత, నవంబరు 18, (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లోని గ్రామ పంచాయతీ వర్కర్స్ వేతనాలను తక్షణమే చెల్లించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు సోమవారం టీయూసీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీయూసీ జిల్లా కోశాధికారి సి.రాజు మాట్లాడారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ముందు వరుసలో ఉండి పని చేసే గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించకపోవడం విచారకరమని అన్నారు. కొన్ని గ్రామాల్లో వేతనాలు వచ్చిన చాలా మండలాల్లోని గ్రామాల్లో మూడు నుంచి నాలుగు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించడంతో పాటు కార్మికుల పని ప్రదేశాల్లో రక్షణ కోసం శానిటేషన్ సామగ్రి అందించాలని డిమాండ్ చేశారు. అదనపు కలెక్టర్‌ను కలిసిన వారిలో ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గణేష్, జిల్లా ఉపాధ్యక్షుడు గోవిందమ్మ , నాయకులు పెంటన్న, గంగమ్మ, కుర్మయ్య తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే దర్గా నిర్మాణం

వనపర్తి అర్బన్, నవంబరు 18, (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని నల్ల చెరువు కట్టపై దర్గా నిర్మాణం కోసం తన సొంత నిధులతో కృషి చేసింది మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అని బీఆర్ఎస్ మైనార్టీ నాయకుడు జహంగీర్ అన్నారు. సోమవారం మాజీ మంత్రి నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోడ్ల విస్తరణలో భాగంగా పాత బజారులోని పురాతన దర్గాను నల్లచెరువుపై గత ప్రభుత్వంలో నిర్మాణం కోసం నిరంజన్‌రెడ్డి కృషి చేశారని గుర్తు చేశారు. ఇటీవలే కొందరు కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్ల చెరువుపై దర్గా నిర్మాణం కోసం ఎమ్మెల్యే మేఘారెడ్డి కృషి చేశారని మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. దర్గా నిర్మాణం కోసం కృషి చేసింది ఎవరో తెలియాలంటే మేస్త్రీలను, అక్కడ పని చేసిన కూలీలను అడిగితే తెలుస్తుందన్నారు. అవగాహన లేకుండా మాట్లాడే నాయకులు సిగ్గు తెచ్చుకోవాలని మండిపడ్డారు.

సమావేశంలో నాయకులు స్టార్ రహీం, సయ్యద్ జమీల్, వహీద్, ఖాదర్, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.